


EVENING EDITION
నేటి దినపత్రిక
సూర్య
www.suryaa.com
4PM
www.suryaa.com
గురువారం
08-05-2025
పేజీలు: 02






# ట్రెండింగ్‌లో సోఫియా, వ్యోమికా

దేశ చరిత్రలో తొలిసారిగా ఇద్దరు మహిళా అధికారులు సైనిక్ ఆపరేషన్‌పై అధికారిక విలేకరుల సమావేశానికి నాయకత్వం వహించారు. కర్నల్ సోఫియా ఖురేషి, వింగ్ కమాండర్ వ్యోమికా సింగ్ పాకిస్థాన్ లోని ఉగ్రవాద స్థావరాలపై భారత్ చేసిన ఆపరేషన్ సిందూర్ గురించి వివరించారు. అయితే ఇప్పుడు వీరిద్దరి గురించే యావత్ భారత్ చర్చించుకుంటోంది.

**సోఫియా ఖురేషి**


సోఫియా కురేషి గుజరాత్‌కు చెందినవారు. బయోకెమిస్ట్రీలో పోస్ట్ గ్రాడ్యుయేట్ డిగ్రీ పూర్తి చేశారు. ఆమె సైనిక కుటుంబం నుంచి వచ్చారు. ఆమె తాత భారత సైన్యంలో సేవలు అందించారు. మెకనైజ్డ్ ఇన్ఫాంట్రీలో అధికారిగా ఉన్న సైనికుడిని వివాహం చేసుకోవడం సైనిక క్రమశిక్షణ, సేవలో ఆమె జీవితాన్ని మరింత బలపరిచింది. 1990లో సోఫియా సైన్యంలో చేశారు. సోఫియా ఖురేషి 2016లో చిన్నవయసులోనే బహుళజాతి సైనిక విన్యాసాలలో ఆర్మీ బృందానికి నాయకత్వం వహించి చరిత్ర సృష్టించిన మొట్టమొదటి మహిళా అధికారిణిగా నిలిచారు. ప్రస్తుతం ఆమె ఆర్మీలో కార్ప్స్ ఆఫ్ సిగ్నల్స్ ఆఫీసర్‌గా ఉన్నారు. ఇప్పటి వరకు భారత్ నిర్వహించిన అతిపెద్ద విదేశీ సైనిక విన్యాల్లో ఒకటి అయిన ఎక్సర్ సైజ్ ఫోర్స్ 18లో సోఫియా పాల్గొన్నారు. ఆమెకు పీస్ కీపర్‌గా ఎంతో అనుభవం ఉంది. 2006 కాంగోలో పీస్ మిషన్‌కు ఆమె అందించిన సహకారం ప్రత్యేకంగా నిలిచింది. ప్రపంచ వేదికపై భారతదేశానికి ప్రాతినిధ్యం వహించడం ఎంతో గర్వకారణం. మూడు దశాబ్దాలకు పైగా భారత సైన్యానికి సేవలందించారు.

**వింగ్ కమాండర్ వ్యోమికా సింగ్**

వ్యోమికా సింగ్ కు పైలెట్ కావాలన్నది కల. ఇంజనీరింగ్ పూర్తి చేసి వ్యోమికా తన కలను నిజం చేసుకున్నారు. 2004లో ఐఏఎఫ్‌లో చేరారు. 2017లో వింగ్ కమాండ్ హోదా పొందారు. డిసెంబర్ 18, 2019న ఫ్లయింగ్ బ్రాంచ్‌లో శాశ్వత కమిషన్ హోదా పొందారు. అత్యంత క్లిష్టమైన ప్రాంతాల్లో కూడా చేతక్, చీతా హెలికాప్టర్లను నడిపి రికార్డు సృష్టించారు వ్యోమికా సింగ్. వైమానికి రంగంలో ఎంతో పేరు పొందారు. 2020 నవంబర్ లో అరుణాచల్ ప్రదేశ్ లో ఇండియన్ ఎయిర్ ఫోర్స్ జరిపిన మేజర్ మిషన్స్ ను లీడ్ చేశారు. హై-రిస్క్ ఫ్లయింగ్ ఆపరేషన్లలో వ్యోమికా సింగ్ సేవలందించారు.

## బలూచిస్థాన్‌లో బీఎల్‌ఏ దాడి..
# 14 మంది పాక్ సైనికుల మృతి

- బలూచిస్థాన్‌లో బలూచ్ లిబరేషన్ ఆర్మీ (బీఎల్‌ఏ) రెండు దాడులు
- మొత్తం 14 మంది పాకిస్థాన్ సైనిక సిబ్బంది మృతి
- బోలాన్, కేచ్ జిల్లాల్లో రిమోట్ కంట్రోల్డ్ ఐఈడీలతో దాడులు
- మృతుల్లో స్పెషల్ ఆపరేషన్స్ కమాండర్, సుబేదార్
- దాడులకు బాధ్యత వహించిన బీఎల్‌ఏ, పాక్ సైన్యంపై తీవ్ర విమర్శలు



పాకిస్థాన్‌లోని బలూచిస్థాన్ ప్రావిన్స్‌లో మరోసారి నెత్తురు పారింది. వేర్పాటువాద సంస్థ బలూచ్ లిబరేషన్ ఆర్మీ (బీఎల్‌ఏ) జరిపిన రెండు వేర్వేరు దాడుల్లో మొత్తం 14 మంది పాకిస్థానీ సైనిక సిబ్బంది ప్రాణాలు కోల్పోయారు. ఈ ఘటనలు బలూచిస్థాన్‌లో తీవ్రమవుతున్న తిరుగుబాటును, నెలకొన్న ఉద్రిక్త పరిస్థితులను స్పష్టం చేస్తున్నాయి. బోలాన్ జిల్లాలోని మాచ్ ప్రాంతంలోని షోర్కాండ్ వద్ద సైనిక కాన్వాయ్‌ను లక్ష్యంగా చేసుకుని బీఎల్‌ఏ స్పెషల్ టాక్టికల్ ఆపరేషన్స్ స్క్వాడ్ (ఎస్‌టీవోఎస్) రిమోట్ కంట్రోల్డ్ ఐఈడీతో దాడికి పాల్పడింది. ఈ శక్తివంతమైన పేలుడు ధాటికి వాహనంలోని స్పెషల్ ఆపరేషన్స్ కమాండర్ తారిఖ్ ఇమ్రాన్, సుబేదార్ ఉమర్ ఫరూఖ్‌తో సహా మొత్తం 12 మంది సైనికులు అక్కడికక్కడే మరణించారు. సైనిక వాహనం పూర్తిగా ధ్వంసమైంది. అదే రోజు కేచ్ జిల్లాలోని కులగ్ టిగ్రాన్ ప్రాంతంలో పాకిస్థాన్ సైన్యానికి చెందిన బాంబ్ డిస్పోజల్ స్క్వాడ్‌పై బీఎల్‌ఏ ఫైటర్లు మరో దాడి చేశారు. మధ్యాహ్నం సుమారు 2:40 గంటలకు క్లియరెన్స్ ఆపరేషన్ నిర్వహిస్తుండగా రిమోట్ కంట్రోల్డ్ ఐఈడీని పేల్చారు. ఈ ఘటనలో ఇద్దరు సైనికులు మృతి చెందారు. ఈ రెండు దాడులకు బాధ్యత వహిస్తున్నట్లు బీఎల్‌ఏ ప్రతినిధి జీయంద్ బలూచ్ ఒక ప్రకటన విడుదల చేశారు. పాకిస్థాన్ సైన్యం ఒక కిరాయి సైన్యమని, చైనా పెట్టుబడులు, ఇతరుల ప్రయోజనాల కోసం పనిచేస్తోందని ఆరోపించారు. తమ భూమిని ఆక్రమించుకున్న ఈ కిరాయి సైన్యంపై బలూచ్ స్వాతంత్ర్య సమరయోధుల దాడులు మరింత తీవ్రతతో కొనసాగుతాయని హెచ్చరించారు. కాగా, బలూచిస్థాన్ సహజ వనరులతో సమృద్ధిగా ఉన్నప్పటికీ, స్థానిక ప్రజలు పేదరికం, వివక్ష, ఆర్థిక దోపిడీకి గురవుతున్నారని, తమ హక్కులను పాకిస్థాన్ ప్రభుత్వం కాలరాస్తోందని వేర్పాటువాద గ్రూపులు చాలాకాలంగా ఆరోపిస్తున్నాయి. మరోవైపు, బీఎల్‌ఏ వంటి సంస్థలకు ఆఫ్ఘనిస్థాన్ నుంచి మద్దతు లభిస్తోందని పాకిస్థాన్ ఆరోపిస్తోంది. ఈ తాజా దాడులతో బలూచిస్థాన్‌లో ఉద్రిక్తతలు మరింత పెరిగాయి.



## ఆపరేషన్ సిందూర్‌లో
# 100 మంది ఉగ్రవాదులు హాతం

'ఆపరేషన్ సిందూర్'లో 100 మంది ఉగ్రవాదులు హతమైనట్లు కేంద్రం తాజాగా ప్రకటించింది. ఇవాళ ఉదయం కేంద్రం అఖిలపక్ష భేటీ నిర్వహించిన విషయం తెలిసిందే. ఈ భేటీలో ఆపరేషన్ సిందూర్‌కు సంబంధించిన వివరాలను రక్షణమంత్రి రాజ్‌నాథ్ సింగ్ వెల్లడించారు. పాకిస్థాన్, పీవోకేలోని ఉగ్రస్థావరాలపై ఆర్మీ చేపట్టిన దాడుల్లో 100 మంది మరణించినట్లు రాజ్‌రాథ్ తెలిపారు. జమ్ము కశ్మీర్‌లోని పహల్గాంలో పర్యాటకులపై దాడికి పాల్పడి 26 మంది అమాయకుల ప్రాణాలు తీసిన ఉగ్రవాదులపై భారత్ ప్రతీకారం తీర్చుకున్న విషయం తెలిసిందే. ఆ ఉగ్రమూకలను పెంచి పోషిస్తున్న పాకిస్థాన్‌పై మంగళవారం అర్ధరాత్రి దాటిన తర్వాత తీవ్రస్థాయిలో విరుచుకుపడింది. 'ఆపరేషన్ సిందూర్' పేరుతో ప్రతిదాడికి దిగి పాక్ ఆక్రమిత కశ్మీర్ (పీవోకే)తోపాటు పాకిస్థాన్‌లోని మూడు ప్రధాన ఉగ్రవాద సంస్థలు జైషే మహ్మద్, లష్కరే తాయిబా, హిజ్బుల్ ముజాహిదీన్‌లకు చెందిన 9 ఉగ్ర స్థావరాలను ధ్వంసం చేసింది. ఈ దాడితో జైషే చీఫ్ మసూద్ అజార్ కుటుంబం మొత్తం హతమైంది. ఆయన ఫ్యామిలీలోని 10 మంది ప్రాణాలు కోల్పోయారు. అంతేకాదు నలుగురు సహాయకులు, సన్నిహితులు కూడా మరణించినట్లు తెలిసింది. భారత్ దాడితో రగిలిపోతున్న పాక్.. ప్రతిచర్యగా భారత్‌పై ఏ క్షణమైనా దాడులు చేసే అవకాశం ఉంది. ఈ నేపథ్యంలో భారత్ అప్రమత్తమైంది. సరిహద్దు రాష్ట్రాల్లో భద్రతను కట్టుదిట్టం చేసింది. ముఖ్యంగా రాజస్థాన్, పంజాబ్ రాష్ట్రాల్లో హై అలర్ట్ ప్రకటించింది. రెండు రాష్ట్ర ప్రభుత్వాలు పోలీసు సిబ్బంది సెలవులను రద్దు చేశాయి. అంతేకాదు బహిరంగ సభలపై కూడా నిషేధం విధించాయి. పాక్‌తో రెండు రాష్ట్రాల సరిహద్దులను పూర్తిగా మూసివేశారు. సరిహద్దు వద్ద ఎవరైనా అనుమానాస్పదంగా కనిపిస్తే కాల్పులు జరిపేలా భద్రతా దళాలకు ఆదేశాలు జారీ అయ్యాయి.




## 'రెట్రో' లాభాల నుంచి రూ.10 కోట్లు విరాళం ప్రకటించిన సూర్య

తమిళ సూపర్ స్టార్ సూర్య నటించిన రెట్రో చిత్రం తాజాగా రూ.100 కోట్ల క్లబ్‌లో చేరిన విషయం తెలిసిందే. కార్తీక్ సుబ్బరాజు దర్శకత్వం వహించిన ఈ రొమాంటిక్ యాక్షన్ డ్రామాలో పూజా హెగ్డే హీరోయిన్‌గా నటించగా, శ్రియ ప్రత్యేక గీతంలో కనిపించారు. 65 కోట్ల బడ్జెట్‌తో రూపొందిన ఈ సినిమాను సూర్య, జ్యోతిక నిర్మించారు. మే 1న ప్రపంచవ్యాప్తంగా విడుదలైన ఈ చిత్రం ఫస్ట్ షో నుంచే మిశ్రమ స్పందనలను అందుకున్న విషయం తెలిసిందే. తెలుగులో ఈ సినిమాకు నెగిటివ్ టాక్ వచ్చిన తమిళంలో మాత్రం మంచి టాక్‌ను తెచ్చుకుంది. ఇటీవల ఈ చిత్రం రూ.100 కోట్ల క్లబ్‌లో చేరినట్లు చిత్రబృందం ప్రకటించింది. అయితే 'రెట్రో' సాధించిన విజయం పట్ల సంతోషం వ్యక్తం చేసిన సూర్య.. ఈ సినిమా లాభాల నుంచి రూ. 10 కోట్లను విరాళంగా ప్రకటించారు. ఈ మొత్తాన్ని ఆయన తన అగరం ఫౌండేషన్ ద్వారా నిరుపేద విద్యార్థుల విద్య కోసం అందజేయనున్నారు. ఈ సందర్భంగా సూర్య మాట్లాడుతూ రెట్రో సినిమా విజయం సాధించినందుకు ప్రేక్షకులకు కృతజ్ఞతలు తెలిపారు. సమాజానికి తిరిగి ఇవ్వాలనే ఆకాంక్షతోనే తాను అగరం ఫౌండేషన్ స్థాపించానని, నేను ఇవ్వబోతున్న ఈ విరాళం మరింత మంది విద్యార్థుల భవిష్యత్తుకు తోడ్పడుతుందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. విద్య ఒక ఆయుధంతో పాటు ఒక రక్ష వంటిదని ఆయన పేర్కొన్నారు. సూర్య 2006లో అగరం ఫౌండేషన్‌ను స్థాపించారు.

## రక్షణ సిబ్బందికి రిఫండ్.. ఎయిర్ ఇండియా ప్రకటన

విమాన ప్రయాణం కోసం టికెట్లు బుక్ చేసుకున్న రక్షణశాఖకు చెందిన ఉద్యోగులకు ఎయిర్ ఇండియా, ఎయిర్ ఇండియా ఎక్స్‌ప్రెస్ డబ్బులు రిఫండ్ ఇవ్వనున్నది. మే 31వ తేదీ వరకు టికెట్లు బుక్ చేసుకుని, ప్రయాణం రద్ద చేసుకున్న రక్షణ సిబ్బందికి డబ్బులు వాపస్ ఇవ్వనున్నట్లు ఎయిర్ ఇండియా గ్రూపు ప్రకటన చేసింది. ఆపరేషన్ సింధూర్ నేపథ్యంలో చోటుచేసుకున్న పరిణామాల దృష్ట్యా రక్షణశాఖ తమ సిబ్బందికి చెందిన సెలవులను రద్దు చేసింది. టికెట్ రద్దు చేసుకున్న వారికి పూర్తి స్థాయిలో రిఫండ్ ఇవ్వనున్నట్లు ఎయిర్ ఇండియా చెప్పింది. దీనిపై ఆ సంస్థ తన ఎక్స్ అకౌంట్‌లో పోస్టు పెట్టింది.



## ఉత్తరాఖండ్‌లో ఘోర ప్రమాదం.. హెలికాప్టర్ కూలి
# ఐదుగురు మృతి

ఉత్తరాఖండ్‌లో ఘోర ప్రమాదం చోటు చేసుకుంది. హెలికాప్టర్ కూలి ఐదుగురు ప్రాణాలు కోల్పోయారు. మరో ఇద్దరికి గాయాలయ్యాయి. ఈ ఘటన ఉత్తర కాశీ జిల్లాలో గురువారం ఉదయం 9 గంటల సమయంలో చోటు చేసుకుంది.కొందరు పర్యాటకులతో గంగోత్రికి వెళ్తున్న హెలికాప్టర్ భగీరథి నది సమీపంలో కుప్పకూలిపోయింది. ప్రమాద సమయంలో అందులో ఏడుగురు ఉన్నట్లు అధికారులు తెలిపారు. ఐదుగురు ప్రాణాలు కోల్పోగా.. మరో ఇద్దరు గాయాలతో బయటపడ్డారు. సమాచారం అందుకున్న స్థానిక పోలీసులు, రెస్క్యూ బృందాలు హుటాహుటిన ఘటనాస్థలికి చేరుకొని సహాయక చర్యలు చేపట్టారు. క్షతగాత్రులను చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలించారు. ప్రమాదానికి గల కారణాలు తెలియరాలేదు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు అధికారులు వెల్లడించారు.

## పాకిస్థాన్‌ను గ్రే లిస్టులో పెట్టాలి

పహల్గాం ఉగ్రదాడికి ప్రతీకారంగా పాకిస్థాన్‌లోని, పాకిస్థాన్ ఆక్రమిత జమ్ముకశ్మీర్‌లోని ఉగ్రవాద స్థావరాలపై ఆపరేషన్ సిందూర్ పేరుతో సర్జికల్ స్ట్రైక్స్ నిర్వహించిన భారత సేనలను, కేంద్ర ప్రభుత్వాన్ని తాను అఖిలపక్ష భేటీలో అభినందించానని ఏఐఎంఐఎం చీఫ్ అసదుద్దీన్ ఒవైసీ చెప్పారు. ఢిల్లీలో జరిగిన అఖిలపక్ష భేటీ అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు.పహల్గాం ఉగ్రదాడికి పాల్పడిన 'ది రెసిస్టెన్స్ ఫ్రంట్' కు వ్యతిరేకంగా ప్రపంచవ్యాప్తంగా ప్రచారం చేయాలని తాను ప్రభుత్వానికి సలహా ఇచ్చానని అసదుద్దీన్ అన్నారు. అంతేగాక ఆర్టీఎఫ్‌ను ఉగ్రవాద సంస్థగా గుర్తించాలని అమెరికాను కోరాలని కూడా తాను కేంద్రానికి సూచించానని చెప్పారు. అదేవిధంగా పాకిస్థాన్‌ను 'ది ఫైనాన్షియల్ యాక్షన్ టాస్క్ ఫోర్స్ లో గ్రే లిస్టులో పెట్టేలా ప్రయత్నాలు చేయాలని అభిప్రాయపడ్డారు. దాంతో అంతర్జాతీయంగా పాకిస్థాన్‌కు నిధులు రాక కష్టమవుతుందని తెలిపారు.



నేటి దినపత్రిక సూర్య
www.suryaa.com
EVENING EDITION 4PM



## మందుపాతర పేలి ముగ్గురు పోలీసుల మృతి..!

ములుగు జిల్లాలో మందుపాతర పేలుడు సంభవించింది. ఈ ఘటనలో ముగ్గురు పోలీసులు మృతి చెందినట్లు సమాచారం. మావోయిస్టుల కోసం కూంబింగ్ చేస్తుండగా ఈ మందుపాతర పేలింది. వెంకటాపురం మండల సరిహద్దు అటవీ ప్రాంతంలో ఈ ఘటన చోటు చేసుకుంది. ఆపరేషన్ కర్రెగుట్ట పేరుతో 17 రోజులుగా ఈ ప్రాంతంలో కూంబింగ్ చేస్తున్నారు. తెలంగాణలోని ములుగు జిల్లా వెంకటపురం ఎడ్మిల్లి కొండలపై కూంబింగ్ కు వెళ్లిన గ్రేహౌండ్ పోలీసులను లక్ష్యంగా చేసుకుని మావోయిస్టులు ఐఈడి మందుపాతరను పేల్చారు. ఈ ఘటనలో ముగ్గురు గ్రేహౌండ్ పోలీసులు మృతి చెందారు.
మావోయిస్టులను తిప్పికొట్టేందుకు పోలీసులు కాల్పులు జరుపుతున్నారు. రెండు వైపుల నుండి కాల్పులు కొనసాగుతున్నాయి. ఫైరింగ్ కొనసాగుతున్న ఎడ్మిల్లి కొండ ప్రాంతం తెలంగాణ, ఛత్తీస్ ఘడ్ సరిహద్దు ప్రాంతం కావడంతో ఉద్రిక్తత వాతావరణం కొనసాగుతుంది. బాంబుల మోత, ఎన్ కౌంటర్లతో కర్రెగుట్టలు నిత్యం వార్తల్లో నిలుస్తున్నాయి.



## అమృత్‌సర్‌లో హైఅలర్ట్.. పాక్ మిస్సైల్‌ను గాల్లోనే ధ్వంసం చేసిన భారత్

పంజాబ్ అమృత్‌సర్‌లో హైఅలర్ట్ కొనసాగుతోంది. అమృత్‌సర్ పరిసరాల్లో మిస్సైల్ శకలాలు లభ్యం కావటం ఇప్పుడు కలకలం రేపుతోంది. అమృత్‌సర్‌పై మిస్సైల్ దాడికి పాక్ ప్రయత్నించినట్టుగా సమాచారం. కానీ, భారత బలగాలు పాక్ చర్యలను తిప్పికొట్టాయి. పాక్ ప్రయోగించిన మిస్సైల్‌ను గాల్లోనే ధ్వంసం చేసింది భారతసైన్యం. యాంటీ మిస్సైల్ వ్యవస్థ ద్వారా పాక్ దుశ్చర్యను భారత్ అడ్డుకుంది. ఈ క్రమంలోనే అమృత్‌సర్ పరిసరాల్లో కూలిపడిపోయిన మిస్సైల్ శకలాలను గుర్తించారు స్థానికులు. ఈ క్షిపణి ముక్కలు అమృత్‌సర్‌లోని మూడు గ్రామాల్లో పడి ఉన్నాయి. అమృత్‌సర్ గ్రామీణ ఎస్ఎస్‌పి మణిందర్ సింగ్ దీనిని ధృవీకరించారు. వెంటనే సైన్యానికి సమాచారం అందించారు. దాంతో ఒక సైనిక బృందం సంఘటనా స్థలానికి చేరుకుని ఈ క్షిపణులను తమతో తీసుకెళ్లింది. దుధాల, జేతువాల్, పంధేర్ గ్రామాలలో క్షిపణి శకలాలు లభించాయి. ఈ క్రమంలోనే గురువారం రాత్రంతా అమృత్‌సర్‌ను చీకటి కమ్ముకుంది. మరోవైపు, పంజాబ్ పోలీసు అధికారులు, ఉద్యోగుల సెలవులు కూడా రద్దు చేశారు. భారత్, పాకిస్తాన్ ఉద్రిక్తతల నడుమ క్షణ క్షణం పూర్తి అప్రమత్తతో వ్యవహరిస్తోంది అధికార యంత్రాంగం.



## అధైర్యపడకండి, రానున్నది మన ప్రభుత్వమే

రాష్ట్రంలో తప్పకుండా వైయస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తుంది, అందులో ఎలాంటి సందేహం లేదని వైయస్ఆర్‌సీపీ అధ్యక్షులు, మాజీ ముఖ్యమంత్రి వైయస్ జగన్ మోహన్ రెడ్డి ఉద్ఘాటించారు. ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలను చంద్రబాబు అమలు చేయకుండా మోసం చేశారని మండిపడ్డారు. విద్య, వ్యవసాయం, వైద్య రంగాలు పూర్తిగా నీరు గారిపోయాయని అన్నారు. రాష్ట్రంలో రెడ్‌బుక్ రాజ్యాంగాన్ని అమలు చేస్తూ కక్షసాధింపు చర్యలకు పాల్పడుతున్నారని ఫైర్ అయ్యారు. కేసులకు భయపడితే రాజకీయాలు చేయలేమన్నారు. పార్టీ పార్లమెంట్ నియోజకవర్గ పరిశీలకులతో ఆయన మాట్లాడుతూ.... చాలా ముఖ్యమైన వ్యక్తులుగా భావించిన వారినే పార్లమెంటరీ నియోజకవర్గ పరిశీలకులుగా నియమించాం. పార్టీ నిర్మాణంలో ఎవరైతే క్రియాశీలకంగా ఉండగలుగుతారు.. ఎవరైతే పార్టీని నడపగలుగుతారు.. ప్రతిపక్షంలో ఉన్నప్పుడు ఎవరైతే పార్టీకి బలంగా ఉపయోగపడతారు.. అని చాలా అధ్యయనం చేసిన తర్వాత, మీకు ఈ బాధ్యతలు అప్పగించాం. మీలో అందరూ నాతోనే నేరుగా సన్నిహిత సంబంధాలు ఉన్న వారు. ఏం జరుగుతున్నా నాతోనే నేరుగా చెప్పగలిగే చనువు మీ అందరికీ ఉంది. పార్టీని పూర్తిగా బలోపేతం చేయడం మీద మనం ప్రధానంగా ధ్యాస పెట్టాం. జిల్లా స్థాయి నుంచి గ్రామంలో బూత్ కమిటీల నిర్మాణం వరకు ప్రత్యేక ధ్యాస, శ్రద్ధ పెట్టాం. గడిచిన 11 నెలల కాలంగా ఆ దిశలోనే అడుగులు వేశాం. అందులో భాగంగానే జవసత్వాలు నింపి జిల్లా అధ్యక్షులుగా కొత్తవాళ్లను నియమించాం. జిల్లా కమిటీల నుంచి బూత్ కమిటీల వరకు అన్ని పూర్తి చేసే బృహత్తర బాధ్యతను జిల్లా అధ్యక్షులకు అప్పగించాం. జిల్లా అధ్యక్షులు ఒక్కరే ఈ పూర్తి బాధ్యత నెరవేర్చలేరు. వాళ్లకు కూడా సరైన సపోర్ట్ మెకానిజమ్ క్రియేట్ అయితేనే వాళ్ల బాధ్యతను వాళ్లు సక్రమంగా చేయగలుగుతారు. ఆ సపోర్ట్ ఎకో సిస్టంలో భాగంగానే రీజినల్ కోఆర్డినేటర్లను తీసుకొచ్చాం. రీజియన్‌ను వారు కోఆర్డినేట్ చేస్తూ, జిల్లా అధ్యక్షులకు అవసరమైన సహాయ సహకారాలు అందిస్తూ.. వాళ్లతో పని చేయిస్తారు. అప్పుడే పని సులభం అవుతుంది అని దిశా నిర్దేశం చేసారు.

## ఓటిటిలోకి ప్రదీప్ అక్కడ అమ్మాయి ఇక్కడ అబ్బాయి

మన తెలుగు స్మాల్ స్క్రీన్ ఫ్యామిలీ ఆడియెన్స్ కి మోస్ట్ ఫేవరెట్ యాంకర్ లలో ప్రదీప్ మాచిరాజు కూడా ఒకడు. మరి ప్రదీప్ స్మాల్ స్క్రీన్ నుంచి బిగ్ స్క్రీన్ పైకి కూడా ఎంట్రీ ఇచ్చిన సంగతి తెలిసిందే. అలా తాను నటించిన రీసెంట్ చిత్రమే అక్కడ అమ్మాయి ఇక్కడ అబ్బాయి. పవర్ స్టార్ పవన్ కళ్యాణ్ సినిమా టైటిల్ తో వచ్చిన ఈ చిత్రాన్ని దర్శకులు నితిన్, భరత్ లు తెరకెక్కించారు. అయితే ఈ చిత్రం థియేటర్స్ లో వచ్చాక విమర్శకులు, చూసిన ఆడియెన్స్ నుంచి కూడా మంచి రెస్పాన్స్ ని అందుకుంది. ఇక ఫైనల్ గా ఈ సినిమా ఓటిటిలో అలరించేందుకు వచ్చేసింది. ఈ చిత్రాన్ని మన తెలుగు స్ట్రీమింగ్ యాప్ ఈటీవీ విన్ వారు సొంతం చేసుకోగా అందులో ఈ చిత్రం




నేటి నుంచి స్ట్రీమింగ్ కి వచ్చేసింది. మరి అప్పుడు థియేటర్స్ లో మిస్ అయ్యినవారు ఇప్పుడు డెఫినెట్ గా ఓటిటిలో ట్రై చేయవచ్చు.

## ఆంధ్రప్రదేశ్ హైకోర్టు జిల్లా న్యాయవ్యవస్థలో 1621 పోస్టుల భర్తీకి నోటిఫికేషన్

ఆంధ్రప్రదేశ్ హైకోర్టు పరిధిలోని జిల్లా న్యాయవ్యవస్థలో వివిధ విభాగాల్లో ఖాళీగా ఉన్న పోస్టుల భర్తీకి భారీ నోటిఫికేషన్ వెలువడింది. 2025 సంవత్సరానికి సంబంధించి, మొత్తం 1621 పోస్టుల నియామకం కోసం ఏపీ హైకోర్టు అధికారికంగా నోటిఫికేషన్‌ను విడుదల చేసింది.
ఈ నోటిఫికేషన్‌లో జూనియర్ అసిస్టెంట్, టైపిస్ట్, స్టెనోగ్రాఫర్, కోర్టు అటెండెంట్, ప్రాసెస్ సర్వర్ వంటి వివిధ రకాల పోస్టులు ఉన్నాయి. ఈ నియామకాలు రాష్ట్రవ్యాప్తంగా జిల్లా కోర్టులు, సెషన్స్ కోర్టులు మరియు ఇతర న్యాయ సంస్థల్లో ఖాళీలను భర్తీ చేయడానికి ఉద్దేశించినవి.

**అర్హతలు మరియు దరఖాస్తు వివరాలు:**

**విద్యార్హత:** పోస్టును బట్టి ఇంటర్మీడియట్, డిగ్రీ, టైపింగ్ లేదా స్టెనో స్కిల్స్ అవసరం.

**వయస్సు పరిమితి:** సాధారణంగా 18 నుంచి 44 సంవత్సరాల మధ్య (రిజర్వేషన్ వర్గాలకు సడలింపు ఉంటుంది).

**ఎంపిక విధానం:** రాత పరీక్ష, స్కిల్ టెస్ట్ (టైపింగ్/స్టెనో) మరియు ఇంటర్వ్యూ ఆధారంగా ఎంపిక జరుగుతుంది.

**దరఖాస్తు ప్రక్రియ:** ఆన్‌లైన్‌లో ఏపీ హైకోర్టు అధికారిక వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలి.

**ముఖ్య తేదీలు:**

**దరఖాస్తు ప్రారంభం:** నోటిఫికేషన్‌లో పేర్కొన్న తేదీ నుంచి.

**దరఖాస్తు చివరి తేదీ:** త్వరలో ప్రకటించబడుతుంది.

ఆసక్తి గల అభ్యర్థులు ఏపీ హైకోర్టు అధికారిక వెబ్‌సైట్‌ను సందర్శించి పూర్తి వివరాలను తెలుసుకోవాలని సూచించబడింది. ఈ నియామకాలు న్యాయవ్యవస్థలో ఉద్యోగావకాశాలను కోరుకునే వారికి గొప్ప అవకాశంగా భావించబడుతోంది. ఖచ్చితమైన వివరాల కోసం అధికారిక నోటిఫికేషన్‌ను తప్పకుండా చెక్ చేయండి.




## “పాకిస్తాన్‌పై దాడి చేసే హక్కు భారత్‌కి ఉంది”

### బ్రిటీష్ ఎంపీ మద్దతు



భారతదేశానికి పాకిస్తాన్‌పై దాడి చేసే హక్కు ఉందని బ్రిటీష్ పార్లమెంట్ సభ్యుడు (ఎంపీ) ఒకరు సంచలన వ్యాఖ్యలు చేశారు. ఉగ్రవాదానికి వ్యతిరేకంగా భారత్ తీసుకుంటున్న కఠిన వైఖరికి ఆయన మద్దతు తెలిపారు. దేశ భద్రత, ప్రజల రక్షణ కోసం అవసరమైతే భారత్ ఏమైనా చేయవచ్చని ఆయన అభిప్రాయపడ్డారు. బ్రిటన్‌లో ప్రఖ్యాతి గాంచిన ఈ ఎంపీ మాట్లాడుతూ, "పాకిస్తాన్ భూభాగాన్ని ఆధారంగా చేసుకుని పలు ఉగ్ర సంస్థలు భారతదేశంపై దాడులు చేస్తున్నాయి. ఇటువంటి సందర్భాల్లో భారతదేశం ఎదురుతిరగడం పూర్తిగా సమంజసం" అని అన్నారు. అలాగే, ఉగ్రవాదంపై ప్రపంచం ఏకతాటిపై ఉండాల్సిన అవసరాన్ని ఆయన గుర్తు చేశారు. ఈ వ్యాఖ్యలు ప్రస్తుతం అంతర్జాతీయ రాజకీయాల్లో చర్చనీయాంశంగా మారాయి. భారత్‌కు మద్దతుగా నిలిచిన ఈ వ్యాఖ్యలు భారత ప్రభుత్వం తీసుకునే భవిష్యత్ నిర్ణయాలకు ప్రోత్సాహం కలిగించవచ్చని విశ్లేషకులు భావిస్తున్నారు. అంతేగాక, పాకిస్తాన్‌పై ఒత్తిడిని పెంచేందుకు మరిన్ని దేశాలు భారత్‌కు మద్దతుగా రావాల్సిన అవసరముందని కూడా ఆయన సూచించారు.



## విరాట్ కోహ్లీ లైకుకు 2 మిలియన్స్ పెరిగిన ఫాలోవర్స్

ప్రస్తుతం ఐపీఎల్‌లో ఆర్సీబీ తరుపున ఆడుతున్న విరాట్ కోహ్లీ గురించి ఓ న్యూస్ నెట్టింట తెగ వైరలవుతుంది. ఇటీవలే అతడు తనకు తెలియకుండానే ఓ బాలీవుడ్ హీరోయిన్ పోస్టును లైక్ చేశాడు. దీంతో విరాట్ ఫ్యాన్స్ షాకయ్యారు. ఏంటీ ఈ బ్యూటీ పోస్టుకు విరాట్ లైక్ చేశాడు అంటూ అవాక్కయ్యారు ఫ్యాన్స్. అసలు ఏం జరిగిందని తెలుసుకునేలోపే సోషల్ మీడియాలో క్షణాల్లో వైరల్ అయ్యింది. అయితే విరాట్ ఆమె ఫోటోకు పొరపాటున లైక్ చేశాడా.. ? లేదా ఇంకేమైనా కారణం ఉందా అనే ఆలోచించేలోపే నెట్టింట ఈ విషయంపై పెద్ద చర్చే నడించింది. దీంతో ఆ లైక్ గురించి విరాట్ నేరుగా ప్రస్తావించాల్సి వచ్చింది. అసలేం జరిగింది.. ? ఇంతకీ విరాట్ లైక్ కొట్టిన హీరోయిన్ ఎవరు అనేది తెలుసుకుందామా.

## తీరు మార్చుకోని లేడీ పోలీస్ ఆఫీసర్ స్వర్ణలత

సస్పెండై జైలుకు వెళ్లొచ్చినా తీరు మారలేదు..! అక్రమాల్లో ఆరితేరిన లేడీ పోలీస్ స్వర్ణలతకు సినిమా పిచ్చి ఇంకా పోలేదు_ _ _! గతంలో నోట్ల మార్పిడి కేసులో అరెస్టై రాష్ట్రవ్యాప్తంగా సంచలనంగా మారిన రిజర్వ్ పోలీస్ ఇన్స్‌పెక్టర్ స్వర్ణలత పేరు మరోసారి హాట్‌టాపిక్‌గా మారింది. విశాఖపట్నం మధురవాడ సబ్ రిజిస్ట్రార్ చక్రపాణిని బెదిరించిన కేసులోనూ స్వర్ణలత పాత్ర ఉన్నట్లు తేల్చారు పోలీసులు. నకిలీ ఏసీబీ ఇన్స్‌పెక్టర్ సుధాకర్‌ను అడ్డుపెట్టుకుని డబ్బు కోసం సబ్ రిజిస్ట్రార్‌ని బెదిరించినట్లు తేల్చారు. సుధాకర్ కాల్ లిస్ట్ ద్వారా స్వర్ణలత బండారాన్ని బయటపెట్టారు. ప్రస్తుతం బాపట్ల జిల్లాలో ఏఆర్ ఇన్స్‌పెక్టర్‌గా విధులు నిర్వహిస్తున్న స్వర్ణలత కోసం పోలీసులు ముమ్మరంగా గాలిస్తున్నారు.గతంలో 2000 రూపాయల నోట్ల మార్పిడి కేసులో అరెస్టయ్యారు స్వర్ణలత. సినిమాల్లో నటించాలన్న పిచ్చితో డబ్బులు కూడగట్టేందుకు దొంగ పోలీస్ అవతారమెత్తారు. నటనలో శిక్షణ తీసుకోవడమే కాదు_ _ _ డ్యాన్సులు నేర్చుకున్నారు. అంతేకాదు ఏపీ 31పేరుతో ఓ సినిమా పోస్టర్‌ను సైతం రిలీజ్ చేశారు. ఆమె డ్యాన్స్ వీడియోలు, సినిమా



పోస్టర్లు సోషల్ మీడియాలో వైరల్ అయ్యాయి. ఆ తర్వాత నకిలీ దందా వ్యవహారం బయటపడటం.. అరెస్టవ్వడంతో కొన్నాళ్లు సైలెంట్ ఉన్నా స్వర్ణలత.. మళ్లీ దందాలకు పాల్పడుతున్నట్లు తేల్చారు పోలీసులు.